## కథ

# ప్రేమించే మనసు

**కె.వి.సుమలత**

ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్...

దీపారాధన పూర్తిచేసి పిల్లలకు క్యారేజి టైమ్ అయిపోయిందని కంగారుగా వంట చేస్తున్న అనూషకు ఫోన్ మోత విసుగ్గా అనిపించింది. పప్పు తాలింపుకి నూనె స్టవ్‌మీద పెట్టి ఫోన్ వద్దకొచ్చింది.

"హలో" విసుగ్గా అన్న అనూషకు "ఆనంద్ ఉన్నాడాండీ" అన్న అందమైన స్వరం వినిపించింది.

"ఆ పేరుగల వారెవరూ లేరిక్కడ" అంటూ ఫోన్ పెట్టేసి ఒక్కుదుటున వంటగదిలోకొచ్చింది. నూనె కాగిపోయి పొగ వస్తుంది. స్టవ్ కట్టేసి ఈలోగా క్యారేజీ బాక్సుల్లో అన్నం పెట్టసాగింది.

మళ్లీ ఫోన్ రింగవుతోంది. మళ్ళీ అదే స్వరం "కాస్త ఆనంద్‌ని పిలుస్తారా ప్లీజ్"

"ఇపుడేగా చెప్పాను మళ్ళీ చేసారే" అనూష కాస్త కోపంగా అంది. "అది కాదండీ మా ఫ్రెండ్ ఈ నెంబరే ఇచ్చాడు" అన్నాడు అవతల అబ్బాయి. మళ్ళీ వెంటనే "ఎందుకండీ అంత కోపం, కాస్త నిదానంగా చెప్పొచ్చుగా" అన్నాడు.

"సారీ, ఇది సుధాకర్‌గారి ఇల్లు. మీకు రాంగ్ ఇన్‌ఫర్‌మేషన్ ఇచ్చినట్లున్నారు" అని ఫోన్ పెట్టేసి కిచెన్‌లోకొచ్చి కాసిని వడియాలు వేసి బాక్సుల్లో పెట్టి హడావుడిగా బట్టలు మార్చుకొని బయటకు వచ్చింది బుట్ట పట్టుకొని. ఇంటికి తాళం వేయబోతుంటే మళ్ళీ ఫోన్ మోత. తాళం తీసి లోపలకొచ్చింది. "హలో.." ఇందాకటి గొంతు. అనూష సీరియస్‌గా "ఎవరు మీరు, ఎందుకిలా విసిగిస్తున్నారు మరోసారి చేస్తే బాగుండదు" అని టప్‌మని ఫోన్ పెట్టేసి బయటకు పరుగెత్తింది. ఆలస్యమయిందని పరుగులాంటి నడకతో స్కూలుకెళ్ళేసరికి అప్పటికే లంచ్ బెల్ అయి అందరూ భోజనాలు చేస్తుంటే రాజేష్, సురేష్ ఒక పక్కగా నిలబడి మెయిన్ గేటు వైపు చూస్తున్నారు. గబాగబా పిల్లల దగ్గరకెళ్లి "సారీ నాన్న ఆలస్యమయిపోయింది. ఆకలేస్తోందామ్మా" అంటూ బాక్సులు మూత తీసి ఇచ్చింది. "తినిపించనా" అని అడిగితే వద్దు అని ఇద్దరూ స్పూన్‌తో తీసుకొని తినసాగారు. "పిన్నీ, అప్పడం పెట్టొచ్చుగా" అన్నాడు రాజేష్. రాజేష్‌కి 6 సంవత్సరాలుంటాయి. 1వ తరగతి చదువుతున్నాడు. చిన్నవాడు సురేష్ ఎల్.కే.జి.చదువుతున్నాడు.

"రాత్రికి వేసిపెడతానమ్మా ఈ పూటకు తినండి" అంది. వాళ్ళ భోజనాలు అయ్యాక క్యారేజీలు తీసుకొని ఇంటికి వచ్చింది. బుట్ట ఒక పక్కగా పెట్టి మంచినీళ్ళు తాగి రిలాక్స్‌గా మంచంపై మేను వాల్చింది.

అంతలో మళ్ళీ ఫోను మోగింది. ఉదయం జరిగినదంతా గుర్తొచ్చింది. వీడెవడో వీడి సంగతి తేల్చాలి అని విసురుగా ఫోన్ తీసింది.

"హలో" అనూష మాటలు పూర్తికాకుండానే "హ్యాపీ ఫ్రెండ్‌షిప్ డే అండి" ఇందాకటి స్వరం.

"మీకసలు ఏం కావాలి"

"మీరు నమ్ముతానంటే మీకో నిజం చెబుతానండీ, ప్లీజ్ ఒక రెండు నిముషాలు" అన్నాడు.

ఆ అభ్యర్థన కాదనలేక 'సరే చెప్పండి' అంది.

"నేను నిజంగానే ఆనంద్ నెంబరు అని నోట్ చేసుకుని పొరపాటుగా మీకు చేసాను. మీరు కాదని చెప్పాక మళ్ళీ వేరే ఫ్రెండ్‌నడిగితే వాడు కూడా ఆనంద్ ఇదే నంబరు ఇచ్చాడని చెప్పాడు. అందుకే అన్నిసార్లు చేసి విసిగించాను. మేమే వాడి నంబరు రాంగ్‌గా నోట్ చేసుకున్నాము. అదృష్టవశాత్తు వాడే ఇప్పుడు ఫోన్ చేసాడు. వాడి నెంబరు నేను పొరబడ్డాను. మీకు సారీ చెప్దామని చేసానండీ. అనవసరంగా మిమ్మల్ని విసిగించాను. ఈ రోజు ఫ్రెండ్‌షిప్‌డే కదండీ ఎలాగయినా వాడితో మాట్లాడాలని అన్నిసార్లు చేసాను. నన్ను నమ్మండీ" అన్నాడు.

నిజాయితీ ధ్వనించిన అతని మాటలకు తిడదామనుకున్న అనూష సైలెంట్‌గా అయిపోయింది.

"హ్యాపీ ఫ్రెండ్‌షిప్‌డే అండీ" అన్నాడు.

"విష్ యు ద సేమ్" అనేసింది గబుక్కున.

"ఏం చేస్తుంటారు మీరు? మీ పేరేంటి" అన్నాడు.

"అనూష, హౌస్ వైఫ్" అంది.

"అయామ్ మాధవ్. బ్యాంకులో క్యాషియర్‌గా చేస్తున్నాను. మీరు హౌస్ వైఫ్ అని అబద్ధం చెబుతున్నారు. మీ గొంతు వింటుంటే డిగ్రీ స్టూడెంట్‌లా ఉన్నారు" అన్నాడు.


అప్పటికే చాలా ఆలస్యమయిందేమో కడుపులో ప్రేవులు అరుస్తున్నాయి. ఉదయం టిఫిన్ కూడా తినలేదేమో మాట్లాడే ఓపిక కూడా లేక ఉంటానని ఫోన్ పెట్టేసి భోజనానికి లేచింది.

అనూష రామారావు మూడవ సంతానం. రామారావుగారు ఆర్.టి.సి.లో డ్రైవర్‌గా పని చేస్తున్నారు. సుగుణ ఆయన భార్య. ముగ్గురు ఆడపిల్లలు. పెద్ద వాళ్ళిద్దరికీ గవర్నమెంటు ఉద్యోగులతోనే వివాహం జరిపించారు. చిన్న కూతురికి రిటైర్ అయ్యేలోగా మంచి సంబంధం చూసి చేస్తే హాయిగా ఊపిరి పీల్చుకోవచ్చు అనుకుంటుండగా దేవుడు చిన్న చూపు చూసాడు. అనుకోని ఉపద్రవం ముంచుకొచ్చింది.

పెద్ద కూతురు శాంతి బంధువుల వివాహానికి వెళ్ళి వస్తూ ఏక్సిడెంట్లో చనిపోయింది. పిల్లలు చిన్నవాళ్ళు. భర్త సుధాకర్‌కి రావడం కుదరకపోవడంతో భర్త వద్ద వదిలి వెళ్ళడంతో పిల్లలు, భర్తలను అన్యాయం చేసి వెళ్ళిపోయింది. పేరుకు తగినట్లుగానే శాంతమూర్తి. సుధాకర్ స్వతహాగా మంచివాడు. ముత్యాల్లాంటి పిల్లలతో అన్యోన్యంగా సాగిపోయేది వారి కాపురం. పిల్లలు తల్లి మీద బెంగతో మంచం పట్టారు. రామారావు దంపతులు పిల్లలను తమతో తీసుకువెళ్ళదానికి పిల్లలు తండ్రిని విడిచిరామన్నారు. తాము అల్లుడి దగ్గర ఉండటం కూడా కుదరని పని. ఏం చెయ్యాలో పాలుపోక నిశ్చేష్టులయ్యారు. చివరకు బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చారు. చిన్న కూతురు అనూషను, సుధాకర్‌కిచ్చి వివాహం చేయాలనుకున్నారు. డిగ్రీ చదువుతున్న అనూషను సుధకర్‌కివ్వడం అన్యాయమనిపించినా వ్యక్తిగతంగా సుధాకర్ మంచివాడు. మంచి జీతం. పిల్లలు పిన్ని దగ్గర క్షేమంగా ఉంటారు. ఎన్నాళ్ళని మరో పెళ్ళి చేసుకోకుండా ఉండగలడు. వచ్చే అమ్మాయి సుధాకర్‌కి భార్య అవుతుందేమో కానీ పిల్లలకు తల్లి కాలేదు. కాస్త వయసు తేడా, రెండవ పెళ్ళివాడు అనే తప్ప సుధాకర్‌కొచ్చిన లోటు లేదు.

అనూషను దగ్గర కూర్చోబెట్టుకుని పరిస్థితిని వివరించారు. అక్కలంటే ప్రాణం అనూషకి. అందులో శాంతక్క మరీ ఇష్టం. బావగారంటే గౌరవం ఉంది. పిల్లలను చూస్తే ఉసూరుమనిపిస్తుంది. తను కన్న కలలు కుప్పకూలినట్లనిపించినా తప్పని పరిస్థితులలో బాధ్యతలకు తలవంచింది. తన అంగీకారాన్ని తెలియజేసింది. సుధాకర్‌ని కూడా ఒప్పించారు రామారావు దంపతులు.

ఇల్లాలిగా ఆ ఇంట తలకు మించిన బరువు బాధ్యతలతో అడుగుపెట్టింది. మొదట్లో కష్టమనిపించినా క్రమేపీ అలవాటయింది. పనమ్మాయి పై పనులు చేసేది, భర్త సహాయంతో పిల్లల పనులు



తను చూసుకునేది. వంట, పిల్లలతో రోజు గడచిపోయేది.

ఉదయం పిల్లలు టిఫిన్ తిని పాలుత్రాగి వెళ్ళిపోతారు. సుధాకర్ టిఫిన్ తినేసి బాక్సు తీసుకొని వెళ్తాడు. లంచ్‌కి ఇంటికిరాడు దూరమని. పిల్లలకు నచ్చినది వండుకొని మధ్యాహ్నం క్యారేజీ తీసుకువెళ్తుంది. సాయంత్రం సుధాకర్ ఆఫీసునుండి రాగానే పిల్లలతో కాలక్షేపం చేస్తాడు. హోంవర్క్ ఎపుడూ సుధాకరే చేయించటం అలవాటు. తరువాత కబుర్లు చెబుతూ అనూష అన్నం పెట్టిస్తే తినిపిస్తాడు. కథలు చెప్తూ నిద్రపుచ్చుతాడు. ఇంట్లో ఉన్నంత సమయం ఎక్కువగా పిల్లలతోనే గడుపుతాడు. తల్లి లేని లోటు కనిపించకూడదనే తాపత్రయం అతడిది.

మొదట్లో ఏమీ అనిపించకపోయినా అనూషలో అసంతృప్తి చోటు చేసుకుంటుంది. తను ఊహించుకున్న జీవితానికి అనుభవిస్తున్న జీవితానికి పొంతన లేదు. తనంటే భర్తకు లేదు కానీ యిష్టం కూడా లేకపోవచ్చు. తనలాగే పరిస్థితికి కట్టుబడ్డాడు అని అనుకుంటుంటుంది. పిల్లల మధ్య చెరో చెయ్యి వేసి నిద్రపోతున్న భర్తను చూసి ఏమీ అనలేక మౌనం పాటిస్తుంది. పెళ్ళయి 6 నెలలయినా ఏకాంతంగా బయటకు వెళ్ళడం తెలియదు. సరదాగా కబుర్లు చెప్పుకుందీ లేదు. యాంత్రికంగా రోజులతోపాటు తాను సాగుతుంది.

అనూషను గమనించి సుధాకర్ తల ముంగురులు నిమురుతూ "కాస్త టైమివ్వరా నాకు, నేను ఎప్పుడూ ఇలాగే ఉంటాననుకోవద్దు. పిల్లలను కోలుకోనివ్వు. నేను శాంతిని ప్రేమించాను. కానీ నిన్ను అన్యాయం చేయను. నిన్ను ప్రాణంగా భావిస్తున్నా అర్థం చేసుకో" అన్నాడు.

సరేనంటూ తనను తాను సముదాయించుకునే ప్రయత్నం చేసింది అనూష.

గతాన్నంతా నెమరు వేసుకుంటూ పని చేసుకుంటున్న అనూషకు "అనూ, ఫోన్ చూడు" అన్న సుధాకర్ కేక వినిపించింది. గబాగబా ఫోన్ దగ్గరకొచ్చింది.

"గుడ్ ఈవెనింగ్" మాధవ్ గొంతు.

"గుడ్ ఈవెనింగ్" తనకు తెలియకుండానే అనేసింది.

"ఎపుడెపుడు మీతో మాట్లాడుదామా అని ఎదురు చూస్తున్నా"

"ఎందుకు?"

"తెలియదండీ, కానీ పదే పదే మీతో మాట్లాడాలనిపిస్తుంది. మీ గొంతు చాలా బాగుందండీ"

"ఎవరు అనూ.." అన్న సుధాకర్ మాటలకు రాంగ్ నంబర్ అని చెప్తూ ఫోన్ కట్ చేసింది. ఎందుకో అతని మాటలు చెవుల్లో మార్మోగుతూ నిద్ర కూడా పోలేకపోయింది.

మర్నాడు మళ్ళీ ఫోన్.

"ఎలా ఉన్నారు?" మాధవ్ అడిగాడు.

"బాగున్నాను. మరి మీరో?"

"అస్సలు బాగాలేను. ఒక్కరోజుకే మీరెప్పటి నుండో తెలుసు అనే భావన. ఎపుడు తెల్లవారుతుందా అని చూస్తున్నా"

మౌనంగా వింటోంది అనూష.

"మీరు ఏం చేస్తుంటారు" అన్న మాధవ్ ప్రశ్నకు అనూషలో కాస్తంత తడబాటు.

"చదువుకుంటున్నారు కదూ! కాలేజికెళ్ళ లేదా?"

"కొన్ని కారణాలతో ఈ సంవత్సరం డిస్‌కంటిన్యూ చేసాను" అన్నది.

"సరే, మీకు నేను మళ్ళీ ఎపుడు కాల్ చేయవచ్చు" అని అడిగాడం.

కాస్త తటపటాయిస్తూనే ఉదయం 9.30నుండి సాయంత్రం 4 గంటలలోపు అన్నది.

అబద్ధం చెబుతున్నందుకు బాధపడినా మాధవ్ మాటలు అనూష మనసుని ఆకర్షించాయి. మధ్యాహ్నం మళ్ళీ ఫోన్ వచ్చింది. ఈసారి అనూష

కూడా ఉత్సాహంగా మాట్లాడింది. ఒకరి అభిరుచులు ఒకరు తెలుసుకున్నారు. హాయిగా నవ్వుకున్నారు.

అది మొదలుకొని రోజు రోజుకి ఒకరంటే ఒకరికి ఇష్టం పెరగసాగింది. గొంతు వినకుండా ఉండలేని స్థితికి వచ్చారు. ఇంతకాలం అనుభవించిన ఒంటరితనం, జీవితంపట్ల నిరాసక్తత ఎగిరిపోయాయి. ఎపుడూ మాధవ్ ఆలోచనలే. ఒకరినొకరు చూసుకుందామని మాధవ్ ఒత్తిడి చేయసాగాడు. ఎపుడు ఆ ప్రస్తావన వచ్చినా తప్పించుకునేది.

"అనూ నాకు నీ మనసు నచ్చింది. నువ్వు ఎలా ఉన్నా మనం పెళ్లి చేసుకుందాం. ఇక నేను నీకు దూరంగా ఉండలేను. ఇంకా ఎందుకు ఆలస్యం చేస్తున్నావు? రేపు నీవు నన్ను కలవకపోతే ఇక నా గొంతు నీవు వినలేవు" అన్న మాధవ్ మాటలకు గతుక్కుమంది.

తనను చూసి తాను వివాహితనని తెలిసి తననెంత అసహ్యించుకుంటాడో, ఇక తన ముఖం చూడడు మాట్లాడడు అన్న దిగులు ఒక్కసారిగా ఆవరించేసింది. మాధవ్ ప్రేమ కరువయితే తాను బ్రతుకగలదా అని కుమిలిపోయింది. ఎవరితోనూ మాట్లాడకుండా మౌనంగా ఉంది. ఏమయిందీ, ఒంట్లో బాగాలేదా, హాస్పిటల్ కెళ్దాం అన్న సుధాకర్ ప్రశ్నకు "కాస్తంత నీరసంగా ఉంది. పడుకుంటే తగ్గిపోతుంది, వద్దు" అని కళ్ళు మూసుకొని పడుకుంది.

"ఇదిగో ఈ పాలు తాగి టాబ్లెట్ వేసుకో" అని లేపి సుధాకర్ ఇచ్చిన బిళ్ల మింగి పాలు త్రాగి పడుకుంది.

క్షణకాలం తప్పు చేస్తున్నానా అని బాధ అనిపించినా, మానసికంగా అలసిపోయిందేమో కళ్ళు మూసుకోగానే నిద్రలోకి జారుకుంది.

అనుకున్నట్లుగానే ఉదయం 10 గంటలకు శివాలయానికి వెళ్ళింది. పింక్ చీరలో, లూజుగా అల్లుకున్న జడలో పింక్ గులాబితో చూడముచ్చటగా ఉంది అనూష. సహజంగానే సౌందర్యవతేమో మరీ అందంగా వుంది. తీరైన శరీర సౌష్టవం ఆమెది. అనూషను పింక్ డ్రెస్‌లో, తను బ్లాక్ అండ్ వైట్ ప్యాంట్ షర్ట్‌లో ఉంటానన్నాడు.

మండపం దగ్గరలో బ్లాక్ ప్యాంట్, వైట్ టీ షర్ట్‌లో ఒక అబ్బాయి నిలబడి ఉన్నాడు. చామనఛాయలో కళగల ముఖంతో చూడగానే బాగున్నాడు అనిపించేలా ఉన్నాడు. తనను చూసి కూడా ముఖం తిప్పుకుని ఎవరికోసమో పదే పదే గుమ్మంవైపు చూస్తున్నాడు. గుడిలోపలకు వెళ్లి అర్చన చేయించుకొని వచ్చి మండపానికి ఆవల కూర్చుని మాధవ్ వంక చూస్తోంది. చాలా అసహనంగా గడియారం వంక, గుమ్మం వంక చూస్తున్నాడు. ఇక లాభంలేదని తనే లేచి మాధవ్ వద్దకొచ్చి "హలో" అంది.

"నీవు.. మీరు.." అంటూ వెనుదిరిగిన మాధవ్ తనను చూసి నిశ్చేష్టుడయ్యాడు.

"నేను" అనూష అంది.

తన పాపిట్లో కుంకుమ, మెడలో మంగళసూత్రం తాడు వంక మార్చి మార్చి చూస్తూ నోట మాట రాక నిలబడిపోయాడు. అతని పరిస్థితి ముందుగానే ఊహించి కూడా అతన్నెలా ఎదుర్కోవాలో అర్థం కాక అక్కడ నిలబడలేక పరుగు లాంటి నడకతో వెళ్లిపోయింది అనూష.

ఆ రోజంతా ఇరువురి మధ్య ఎలాంటి కాల్స్ లేవు. మర్నాడు కూడా భరించరాని నిశ్శబ్దం కొనసాగింది. ఈ రెండు రోజులు జీవచ్ఛవంగా క్షణమొక యుగంగా గడిచింది అనూషకి. మాధవ్ తనను క్షమించడనే ఊహ చిత్రవధ చేస్తోంది. ఏదో మూల ఆశతో ఫోన్ రింగయిన ప్రతిసారీ మాధవ్ కావచ్చనే ఎదురుచూస్తోంది. మూడవ రోజు ఉదయం మామూలు టైమ్‌కే ఫోన్ మోగింది. ఉద్విగ్నమైన స్వరంతో "హలో" అంది.

"నన్నెందుకు మోసం చేసారు? నేను మీకేం అన్యాయం చేసానని నాకీ శిక్ష?" అన్న మాటలు వినిపించాయి.

బావురుమని ఏడ్చేసింది అనూష. అప్పటి వరకు ఆపుకున్న దుఃఖం ఆగకుండా వచ్చేసింది.

నివ్వెరపోయాడు మాధవ్. ఎలా ఓదార్చాలో కూడా తెలియడంలేదు అతనికి.


కాసేపటి తర్వాత దుఃఖాన్ని ఆపుకుని జరిగినదంతా అతనికి చెప్పింది. ఉద్దేశపూర్వకంగా చేయలేదు. తమాషాగా అబద్ధం ఆడినా అతని ప్రేమ నిజం చెబితే దూరం అవుతుందని చెప్పలేదంది. తన వివాహ విషయాలు కూడా చెప్పింది. తను కోరుకున్నవన్నీ మాధవ్ ద్వారా తనకు లభించాయని అందుకే ఆ ప్రేమకు కట్టుబడ్డానంది.

ఈ రెండు రోజులు నీకు దూరంగా వుండాలని నీ మీద కోపంతో నీకు తిరిగి ఫోన్ చేయకూడదని విశ్వప్రయత్నం చేసినా వుండలేక తిరిగి చేసానన్నాడు మాధవ్.

కొద్దిసేపు నిష్ఠూరాలాడుకుని తిరిగి ఒకటయిపోయారిద్దరూ. ఈసారి రెట్టింపు ప్రేమతో మాటలకే పరిమితం కాక అప్పుడప్పుడు గుడిలో పార్కుల్లో కలుసుకోవటం వరకు వచ్చింది. ఒకరంటే ఒకరికి మరింత ఇష్టం బలపడింది. శారీరకమైన ఆకర్షణకు లోనుకాసాగారు. మనం పెళ్లి చేసుకుందాం, తర్వాత మావాళ్లని నేను ఒప్పిస్తాను అని మాధవ్ ఒత్తిడి చేస్తున్నాడు. తను కూడా అనురాగపూరితమైన మాధవ్ మాటలకు దూరంగా వుండలేకపోతోంది. వెళ్లిపోతే తప్పేంటి, ఇష్టపూర్వకమైన జీవితం గడపవచ్చు అని

## సోయగాల అశిన్

**అశిన్** గ్లామరస్ స్టార్ అని అందరికీ తెలుసు. అందచందాలు ఆరేయడంలో పెద్దగా మొహమాటాలు లేవనీ అనిపించినా మరీ 'శృతిమించి' తెరపై సెక్సీగా కనిపించిన దాఖలాలు ఇప్పటిదాకా లేవు కదా. కానీ రాబోయే హిందీ 'గజినీ' సినిమాలో అశిన్ తీరు ఆ యూనిట్ వాళ్లనే ముక్కున వేలేసుకునేలా చేసిందిట. ఆమీర్ ఖాన్‌తో కలిసి ఆమె చేసిన ఓ పాటలో బోల్డంత సెక్సీగా నటించిపారేసింది అశిన్. సెన్సారు కత్తెరకు బలికాకుండా వస్తే కుర్ర ప్రేక్షకులకు కనుల పండుగేనన్నమాట.



పించసాగింది అనూషకు.

ఈమధ్యన సుధాకర్‌ని చూస్తున్నా పిల్లలను చూస్తున్నా కోపం వస్తోంది. హాయిగా అందరిలా చక్కటి కాపురం చేసుకోవలసిన తనకు ఈ పరిస్థితి రావడానికి వీళ్లే కదా కారణం అనిపిస్తోంది. అయిన దానికీ కానిదానికీ పిల్లల మీద చిరాకు పడుతుంది. కసురుకుంటుంది. మొన్నటి వరకు ప్రేమగా వున్న పిన్నికేమయిందో తమనెందుకు దూరం చేస్తోందో తెలియక చిన్నబుచ్చుకుంటున్నారు పిల్లలు. బిక్కుబిక్కుమంటూ తండ్రిని అంటుకుపోతున్నారు.

"ఏమైంది, ఒంట్లో బాగుండడం లేదా?" అంటూ మీద చెయ్యి వేయబోతే చిరాకు పడింది అనూష. ఆమె ప్రవర్తనకు కారణం ఏమై వుంటుందో ఎంత ఆలోచించినా సుధాకర్‌కి అర్థం కావడంలేదు. ఒకవేళ తన నిర్లిప్తతతో ఈ విధమైన మార్పు వచ్చిందేమోనని ఇంటికి తొందరగా రావడం, కాస్త సరదాగా మాట్లాడడం, బయటకు వెళ్దాం అని అడగడం చేస్తుంటే అనూషకి భరించరానివిగా అనిపిస్తున్నాయి. మాధవ్ తప్ప ఎవరూ తనకు నచ్చడం లేదు. వీళ్ల ఉనికికి దూరంగా మాధవ్ కోరుకున్నట్టుగా మర్నాడు గుడిలో పెళ్లికి ఒప్పుకుంది అనూష. ఈ ఒక్క రాత్రి ఈ నరకం అనుభవిస్తే రేపటి నుంచి కోరుకున్న జీవితం లభ్యమవుతుంది కదా అనుకుని తేలిగ్గా గాలి పీల్చుకుంది.

రూం నుంచి బయటకు వస్తూంటే దూరంగా పిల్లలిద్దరూ దిగులుగా కూర్చుని కనిపించారు. ఆ రోజు ఆఫీసు నుంచి సుధాకర్ ఇంకా రాలేదు. తండ్రి రాక కోసం చూస్తూ కూర్చున్నారు పిల్లలు. ఎందుకో ఒక్కసారిగా జాలివేసి వెళ్లి మధ్యలో కూర్చుంది. భయం భయంగా దూరం జరిగారు. దగ్గరకు లాక్కుని ఇద్దరినీ ముద్దు పెట్టుకుంది. ఇద్దరూ పిన్నిని హత్తుకుపోయారు. అన్నం కలుపుకుని వచ్చి కథ చెబుతూ తినిపించింది.

చెరోవైపు పడుకోబెట్టుకుని నిద్రపుచ్చసాగింది. హఠాత్తుగా చిన్నబాబు- "పిన్నీ, నీకు బాగైపోయిందా?" అన్నాడు.

సుధాకర్ తన ప్రవర్తనకు పిల్లలకు అలా చెప్పి వుంటాడని అర్థం చేసుకున్న అనూష "తగ్గిపోయింది నాన్నా" అంది.

పెద్దబాబు "పిన్నీ! నువ్వు ఎప్పుడూ ఇలాగే వుండవా? అమ్మ ఇలాగే వుండేది" అన్నాడు. "మేము రోజూ దేవుడికి దండం పెట్టుకున్నాము నీకు తగ్గిపోవాలని" అన్నాడు తిరిగి.

ఒక్కసారిగా తన ప్రవర్తన పిల్లలనెంత బాధపెట్టిందో అర్థమైంది అనూషకి. తనని అంటుకుపోయిన పిల్లలను చూస్తుంటే ఎంత తప్పు చేసిందో అర్థం కాసాగింది. అంతలో సుధాకర్ వచ్చి కాలింగ్ బెల్ కొట్టడంతో వెళ్లి తలుపు తీసింది.

"సారీ... లేటయింది. పిల్లలు భోజనం చేసారా?" అని అడిగాడు.

"తిన్నారు, నిద్రపోయారు" అన్నది అనూష.


అలసిపోయినట్టున్న సుధాకర్ అక్క పోయాక ఎండిపోయాడు. తను పట్టించుకోక పిల్లల పనులు అదనంగా అయి, మానసికంగా కృంగిపోయినట్టున్నాడు. తనను మంచి నీళ్లు కూడా అడిగే ధైర్యం లేక అలా సొమ్మసిల్లినట్టు సోఫాలో వెనక్కి వాలాడు.

పాపం అనిపించి మంచినీళ్ల గ్లాసుతో వచ్చి పక్కన కూర్చుంది అనూష.

ఆశ్చర్యంగా గ్లాసు అందుకుని తాగాడు.

"వెళ్లి స్నానం చేసి రండి, భోజనం చేద్దాం" అన్నది.

తను వింటున్నది నిజమేనా? అని మళ్లీ అయోమయంగా చూసి లేచివెళ్లాడు. అంతా గమనించి అన్నం కంచాలు సర్దసాగింది. స్నానం పూర్తి చేసుకువచ్చిన సుధాకర్‌కి మరో వింత కనిపించింది. తనతో పాటు భోజనానికి అనూష కూడా కూర్చుంది. ఈమధ్య కాలంలో అనూష అన్నీ అక్కడే పెట్టేసి వెళ్లిపోతోంది. సంభ్రమంగా చూస్తూ మౌనంగా భోజనం ముగించాడు సుధాకర్.



## యాభై మూడేళ్ల యంగ్‌స్టార్

**వయసు మీద పడుతున్న కొద్దీ యంగ్‌గా తయారవుతున్న బాలీవుడ్ తార రేఖ నిన్నటి అక్టోబర్ 10 తేదీకి 53వ ఏట ప్రవేశించింది. అసలామెకి యాభై ఏళ్లంటే కూడా నమ్మబుద్ధి కాదంటారు సినీజనాలు సైతం. నటిగా తనదైన ఇమేజ్‌ని సొంతం చేసుకున్న రేఖ ఇంకా ఒంటరే! 'నాకు పెళ్లి, పిల్లలు లేరు కాబట్టి నేనేం సాధించాను అని చాలామంది భావిస్తారని నాకు తెలుసు. కానీ జీవితంలో మనం సాధించడానికి ఎంతో వుంటుంది. ఆశావహంగా ముందుకు సాగిపోవడమే మన వంతు' అని వేదాంతాన్ని బోధిస్తుంది రేఖ.**

వంటిల్లు సర్దుకుని బయటకొచ్చిన అనూషకి సోఫాలో తన కోసం ఎదురుచూస్తూ సుధాకర్ కనిపించాడు. దగ్గరకు తీసుకుని ఒళ్లో పడుకోబెట్టుకుని తల నిమురుతూ "నువ్విలా వుంటే ఎంత బాగుందో తెలుసా? నా స్వార్థంతో నీ జీవితం నాశనం చేసాను. నీకు పెద్ద బాధ్యతలు అంటగట్టాము అందరం. నన్ను క్షమించు. దానికి పసివాళ్లను బాధపెట్టకు. నా ఉదాసీనతే నీ మార్పుకి కారణమైతే నన్ను క్షమించు కానీ అలా ముభావంగా వుండకు. ఇక మనం ఆనందంగా వుందాం" అన్న సుధాకర్ మాటలకు కళ్లల్లో నీళ్లు తిరిగాయి. లేచి అతన్ని చుట్టేసింది అనూష. ఇన్ని రోజులు వారి మధ్య వున్న అపార్థాలకు ఆ రాత్రి వీడ్కోలు చెప్పింది.

తనని చుట్టుకున్న అతని చేతుల్లో ఆమె ఒదిగిపోయింది.

మర్నాడు ఆఫీసుకెళ్తున్న సుధాకర్‌తో "మన ఫోన్ కనెక్షన్ తీయించేసెయండి" అన్నది అనూష.

"ఎందుకు?" అతని మాటలు పూర్తి కాకుండానే "ప్రస్తుతం నేనేం చెప్పను కానీ చేస్తారా లేదా?" అన్నది చిరుకోపంతో.

"ఆజ్ఞ... శిరసా వహిస్తాను" అంటూ నవ్వుతూ వెళ్లిపోయాడు సుధాకర్.